క్లుప్తంగా

స్వరాష్ట్రంలోనే గౌలి సమాజానికి గుర్తింపు

స్టేషన్ మహబూబ్‌నగర్: వందల ఏళ్ల చరిత్ర ఉన్న గౌలి సమాజానికి స్వరాష్ట్రంలోనే గుర్తింపు దక్కిందని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని మోనప్ప గుట్ట లక్ష్మమ్మ ఆలయంలో గౌలి సమాజం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మహామంగళహారతి కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌలి కులస్తులకు బీసీ జాబితాలో చోటులేక వారి పిల్లలు చదువుకునేందుకు కూడా ఇబ్బందులు పడ్డారన్నారు. తాను మంత్రి అయ్యాక గౌలి కులస్తుల సమస్యలపై సీఎం దృష్టికి తీసుకెళ్లి బీసీ జాబితాలో చేర్చామన్నారు. లక్ష్మమ్మ ఆలయానికి షెడ్డు నిర్మాణం కోసం గతంలోనే నిధులు అందజేశామని తెలిపారు. ప్రస్తుతం ఆలయ నిర్మాణం, షెడ్డు విస్తరణ కోసం రూ.45 లక్షల నిధులు అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్, కౌన్సిలర్ గోవింద్, నాయకులు హరిశంకర్, గౌలి సమాజం నాయకులు గౌలివీరు, కిషోర్, అంబన్, వెంకట్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూమి సర్వే

అడ్డాకుల: మూసాపేట మండలం చక్రాపూర్‌లో మంగళవారం దేవాలయ భూమిలో అధికారులు సర్వే నిర్వహించారు. సర్వే నంబర్ 3లో స్థానిక ఆంజనేయస్వామి దేవాలయానికి చెందిన భూమి ఉండగా కొన్నాళ్ల కిందట కొందరు కబ్జా చేసి సాగు చేసుకుంటున్నారు. దీనిపై దేవాదాయశాఖ అధికారులు కోర్టుకు వెళ్లగా సదరు భూమి దేవాలయానికి చెందినదిగా తీర్పు రావడంతో సర్వే చేపట్టినట్లు దేవాదాయశాఖ ఉద్యోగి అనంతసేన్‌రావు తెలిపారు. మండల సర్వేయర్ సునిత సర్వే చేసి హద్దులను గుర్తించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నవాబుపేట: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు. మంగళవారం మండలంలోని కల్మన్‌కల్వకు చెందిన రాజేందర్ గ్రామ సమీపంలోని వాగులో ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రావటంతో పోలీసులు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ వివరించారు. ట్రాక్టర్ యజమానిపై కేసునమోదు చేశామని వివరించారు.

ఆయుర్వేద ఆస్పత్రి సందర్శన

అడ్డాకుల: జోగుళాంబ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు మంగళవారం మండల కేంద్రంలోని ఆయుర్వేద ఆస్పత్రిని సందర్శించారు. డాక్టర్ లావణ్యను కలిసి తనకు కావల్సిన ఆయుర్వేద మందులను తీసుకున్నట్లు డాక్టర్ తెలిపారు. కొన్నాళ్ల నుంచి ఆయుర్వేద మందులను ఇక్కడే తీసుకుంటున్నట్లు ఆమె వివరించారు.

రైతుబీమాకు దరఖాస్తులు

భూత్పూర్: రైతుబీమా పథకానికి ఈ నెల 18లోగా దరఖాస్తు చేసుకోవాలని మండల ఏఓ మురళీధర్ ప్రకటనలో తెలిపారు. కొత్తగా పట్టాదారు పాసు పుస్తకం వచ్చిన రైతులు సైతం దరఖాస్తు చేసుకోనేందు అవకాశం ఉందని తెలిపారు. 18 నుంచి 59 సంవత్సరాల లోపు గల వారు మాత్రమే అర్హులని, రైతు స్వయంగా వచ్చి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అంతర్రాష్ట్ర కార్మికచట్టం అమలు చేయాలి

జడ్చర్ల టౌన్: స్థానికంగా ప్రతి పరిశ్రమలో 90శాతం మంది ఇతర రాష్ట్రాలకు చెందిన వారే కార్మికులుగా పనిచేస్తున్నారని, దీని కోసం అంతర్రాష్ట్ర వలస కార్మిక చట్టం 1979ను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య డిమాండ్ చేశారు. ఈనెల14న నిర్వహిస్తున్న చలో కలెక్టరేట్ కార్యక్రమానికి సంబంధించి పోలేపల్లి సెజ్‌లో మంగళవారం ఆటోజాతా చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 73షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాలు వెంటనే సవరించాలన్నారు. రాష్ట్రంలో 15ఏళ్లుగా కనీస వేతనాలు సవరించలేదని, ప్రైవేట్‌రంగంలో పనిచేస్తున్న కోటిమందికి పైగా ఉన్న కార్మికుల జీతభత్యాలు పెంచక పోవటం వల్ల రూ.కోట్లు కార్మికులు నష్టపోయారన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

కోయిల్‌కొండ: గ్రామాల్లోని యువకులు క్రీడల్లో రాణించాలని సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వీరంపల్లిలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌లో గెలుపొందిన టీంకు ఆయన ప్రైజ్ మనీని అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ హనుమంతు, చిన్నారెడ్డి, నరసింహారెడ్డి, గంగయ్య, వెంకటయ్యగౌడ్, వెంకటేష్, వంశీ, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు అందించండి

బాలానగర్: మండల కేంద్రంతోపాటు మోతీఘణాపూర్‌కు సరిపడా మిషన్ భగీరథ నీరు రావడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. మండల కేంద్రంలో స్థానికుల ఆధారంగా నీరు అందిస్తున్నా ఇతర గ్రామాలు, రాష్ట్రాల నుంచి వలస వచ్చి జీవనోపాధికై ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటుచుకున్న వారు వందల సంఖ్యలో ఉంటుందన్నారు. మోతీఘణాపూర్ పరిసర పరిశ్రమలలో పనిచేసే కార్మికులు వందల సంఖ్యలో నివాసం ఉంటున్నారు. గ్రామస్తులకు అందించేందుకు మిషన్ భగీరథ నీరు చాలడంలేదని అధికారులు వెంటనే స్పందించాలని సర్పంచ్ మాలతి కోరారు.

భక్తిశ్రద్ధలతో బోనాల ఊరేగింపు



మంత్రితో నృత్యం చేయిస్తున్న స్థానికులు



రవీంద్రనగర్‌లో బోనాలతో యువతులు



దేవరకద్రలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు పట్టణం బోనమెత్తింది. డప్పుల చప్పుళ్లతో మంగళవారం పలు ప్రాంతాల్లో బోనాల జాతర హోరెత్తింది. రవీంద్రనగర్, కొత్త గంజి హనుమాన్‌నగర్, న్యూప్రేమ్‌నగర్, రాజేంద్రనగర్, వీరన్నపేట, ఏనుగొండ, న్యూమోతీనగర్, హౌసింగ్‌బోర్డు కాలనీ, బీకేరెడ్డికాలనీతో పాటు ఇతర ప్రాంతాల్లో బోనాల వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున ఊరేగింపుగా పోచమ్మ దేవాలయాలకు బోనాలు తీసుకొచ్చి అనంతరం అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల ఊరేగింపుతో పండుగ వాతావరణం నెలకొంది. పలు వార్డుల్లో బోనాల వేడుకల్లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

భూత్పూర్: మున్సిపాలిటీలోని గోప్లాపూర్‌లో మంగళవారం సాయంత్రం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. బొడ్రాయి వద్ద బోనం కుండలతో మహిళలు, యువతులు, చిన్నారుల పోచమ్మ దేవాలయం వద్దకు వెళ్లి బోనం సమర్పించారు.

హన్వాడ: మండల కేంద్రంలో, కొత్తపేటలో మంగళవారం పోచమ్మ బోనాల అంబరాన్నంటాయి. అలంకరించిన బోనాలను మహిళలు నెత్తిన పెట్టుకుని శోభాయమానంగా కదిలారు. ఊరంతా స్థానిక ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు.

రాజాపూర్: మండలంలోని తిర్మలాపూర్‌లో మంగళవారం బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాజీ సర్పంచ్ రామకృష్ణగౌడ్ ఊరేగింపుగా వెళ్లి గ్రామ శివారులో ఉన్న పోతురాజు బోనం సమర్పించారు.

దేవరకద్ర: మండల కేంద్రంలో బోనాల ఉత్సవాలలో పోచమ్మకు అంబలి నైవేద్యం సమర్పించడం ప్రత్యేకతగా నిలిచింది. నియోజకవర్గ కేంద్రంలో పోచమ్మ దేవాలయం వద్ద ఆర్యవైశ్యం సంఘం ఆధ్వర్యంలో ప్రసాదాలను పంపిణీ చేశారు. మండల కేంద్రంలో తెల్లవారుజాము నుంచి పోచమ్మ దేవాలయంలో అభిషేకాలు, అర్చనలు పెద్దఎత్తున నిర్వహించారు. కురుమవాడ, తెలుగువాడ, దళితవాడల నుంచి వేలాది మంది మహిళలు బోనం కుండలతో ఊరేగింపు కన్నుల పండువగా సాగింది. అదేవిధంగా చిన్నరాజమూరు, గూరకొండలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కోయిల్‌కొండ: మండల కేంద్రంలో పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు.

మిడ్జిల్: మండలంలోని వేములలో ఈదమ్మ బోనాలను ప్రజలు నిర్వహించారు. మహిళలు ఉపవాస దీక్షలతో బోనాలతో వెళ్లి నైవేద్యం సమర్పించారు.



భూత్పూర్ మండలం గోప్లాపూర్‌లో..



హన్వాడలో..



మహబూబ్‌నగర్ కొత్తగంజ్‌లో..



మిడ్జిల్ మండలం వేములలో..



కోయిల్‌కొండలో..

సాయం అందించిన సర్కారును మరువద్దు



చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల టౌన్: సాయం పొందిన వారు సర్కారును మరువద్దని, అండగా ఉండాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో పట్టణం, మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన 19మందికి రూ. 12లక్షల విలువచేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో సీఎం సహాయనిధి నుంచి మండలానికి ఒక్క చెక్కు వచ్చేది కాదని, నేడు వేలాది మందికి ప్రభుత్వం నుంచి సాయం అందుతుందన్నారు. చెక్కులు పొందిన వారు గ్రామాల్లోకి వెళ్లి పదిమందితో చర్చించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య, రఘుపతిరెడ్డి, కౌన్సిలర్ రఘురాంగౌడ్, ముడా డైరెక్టర్లు శ్రీకాంత్, ఇంతియాజ్, నాయకులు మురళి, రవీందర్, హఫీజ్, పర్మటయ్య పాల్గొన్నారు.

మున్సిపాలిటీలోని పాతబజార్ గణేష్‌నగర్‌లోని దుర్గామాత బోనాల ఉత్సవంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

పార్టీ బీమా చెక్కు..

మండలంలోని గొల్లపల్లికి చెందిన నర్సింహులు కొంతకాలం క్రితం రోడ్డుప్రమాదంలో మృతి చెందారు. బీఆర్‌ఎస్ సభ్యత్వం ఉండటంతో పార్టీ నుంచి రూ.2లక్షల బీమా చెక్కు మంజూరైంది. చెక్కును మృతుడి భార్య చిట్టెమ్మకు మంగళవారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి క్యాంప్ కార్యాలయం వద్ద అందజేశారు.

కార్మికుల కుటుంబాలను పరామర్శ

మున్సిపాలిటీలో కాంట్రాక్టు కార్మికులుగా పని చేస్తున్న ముగ్గురు వేర్వేరు ప్రమాదాల్లో మృతిచెందటంతో మంగళవారం ఎమ్మెల్యే వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాసయ్య, నాగార్జున, చెన్నయ్య ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు.

చిన్నారుల కుటుంబాలకు మంత్రి పరామర్శ

మహబూబ్‌నగర్ క్రైం: హన్వాడ మండలంలోని తిరుమల్ కుచ్చతండాకు చెందిన చిన్నారులు శివ, గణేష్ నీటి గుంతలో పడి మృతి చెందారు. చిన్నారుల మృతదేహాలను జిల్లా జనరల్ ఆస్పత్రిలోని పోస్టుమార్టం విభాగంలో మంగళవారం రాత్రి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పరిశీలించారు. చిన్నారుల తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

మహబూబ్‌నగర్ క్రైం: ట్రాఫిక్ పోలీసులు మంగళవారం పట్టణంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా వాహనాలు నడిపే వాహనదారులను రోడ్లపై నిలిపారు. ప్రధానంగా హెల్మెట్, త్రిబుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ట్రాఫిక్ ఇన్‌చార్జ్ ఆర్‌ఎస్‌ఐ రమేష్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు ఎవరూ నడపరాదని, తాగి వాహనాలు నడిపితే ప్రమాదాలు అయ్యి రెండు కుటుంబాలు నష్టపోతారని తెలిపారు. ప్రధానంగా తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

భూత్పూర్: మున్సిపాలిటీలోని అమిస్తాపూర్‌లో మంగళవారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. గ్రామస్తులు కథనం ప్రకారం మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలోని క్రిష్టియన్‌పల్లికి చెందిన నిరంజన్, నాగరాజు బైక్‌పై భూత్పూర్ నుంచి క్రిష్టియన్‌పల్లి వెళ్తుండగా అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న గోడను ఢీకొన్నారు. దీంతో వారిద్దరికి తలకు, చేతులకు గాయాలు కాగా 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పోలీసులకు ఫిర్యాదు

జడ్చర్ల టౌన్: మండలంలోని శిఖర్‌గానిపల్లి చెందిన వెంకటమ్మ పట్టాభూమిలోకి వచ్చి దున్నకుండా అడ్డుకుంటున్నారని అదే గ్రామానికి చెందిన మండ్ల నర్సింహస్వామి, మరో 22మంది సీఐ రమేష్‌బాబుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. వృద్ధురాలు అని చూసిచూడనట్లుగా పోతుంటే ఆమె కుమారులు మండ్లస్వామి, వెంకటస్వామి, కోడళ్లు రాధిక, మాధవి 8వ తేదీన మా పట్ట పొలంలో ట్రాక్టర్‌తో దున్నిస్తుండగా అడ్డుపడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇష్టంవచ్చినట్లు దూషించటమే కాకుండా పొలిటికల్ జేఏసీ చైర్మన్ యుగంధర్‌గౌడ్‌ను తీసుకొచ్చి మమ్మల్ని అవమానపర్చేలా ఆరోపణలు చేయించారని పొందుపర్చారు. భూమిపై ఇంజక్షన్ ఆర్డర్లు ఉన్నాయని, బేఖాతరు చేస్తూ బహిరంగంగా, మీడియాపరంగా తమను అప్రతిష్టపాలు చేస్తున్నారని సీఐతో వాపోయారు. స్పందించిన సీఐ విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'పేరుకే వంద పడకల ఆస్పత్రి'

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీపరిధిలో ప్రారంభించిన వంద పడకల ఆస్పత్రి పేరుకు మాత్రమే ఉందని, ఎలాంటి అదనపు సౌకర్యాలు లేవని మాజీ ఎమ్మెల్యే యం.చంద్రశేఖర్ ఆరోపించారు. మంగళవారం ఆయన ఆస్పత్రిని సందర్శించి రోగులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. సమస్యలకు నిలయంగా ఆస్పత్రి ఉందని, ప్రభుత్వం గొప్పలు చెప్పుకోటానికి మాత్రమే నిర్మాణం చేశారని ఎద్దేవా చేశారు. 30పడకల ఆస్పత్రి సిబ్బంది, వైద్యులతోనే నడిపిస్తున్నారని ఆరోపించారు. సూపరింటెండెంట్ సోమశేఖర్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

ఇన్‌చార్జ్‌ను కొనసాగించాలని తీర్మానం

మహబూబ్‌నగర్ న్యూటౌన్: జిల్లా మత్స్య సహకార సంఘానికి ఎన్నికలయ్యే వరకు పర్సన్ ఇన్‌చార్జ్‌గా సత్యనారాయణను కొనసాగించాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల అధ్యక్షులు తీర్మానించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా మత్స్య సహకార సంఘం సమావేశం నిర్వహించారు. 2017 నవంబర్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సత్యనారాయణ పదవీకాలం 2022 జూలై 28న పూర్తయ్యింది. ఆ తర్వాత పర్సన్ ఇన్‌చార్జ్‌గా నియమితులైన ఆయన పదవీకాలం ఈ నెల 27న ముగియనుంది. ఈ నేపథ్యంలో సమావేశమైన జిల్లా సంఘం సభ్యులు ఎన్నికలయ్యే వరకు ఆయనను పర్సన్ ఇన్‌చార్జ్‌గా కొనసాగించాలని సమావేశంలో తీర్మానించారు. ఓటర్ జాబితా తయారు చేసి ఎన్నికల సంఘానికి నివేదిక పంపిన అనంతరం ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోనున్నారు. అప్పటివరకు సత్యనారాయణను పర్సన్ ఇన్‌చార్జ్‌గా కొనసాగించేలా ప్రభుత్వానికి సిఫారసు చేసేందుకు మంగళవారం నిర్వహించిన సమావేశం ప్రాధాన్యతను సంతరించుకోవడం గమనార్హం. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ మత్స్య శాఖ అధికారి లక్ష్మప్ప, మత్స్య శాఖ అధికారులు పటేల్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.



చేతులెత్తి ఏకగ్రీవంగా తీర్మానిస్తున్న సభ్యులు

చదువుపై ఆసక్తి కలిగేలా బోధించాలి

అడ్డాకుల: విద్యార్థులకు చదువులపై ఆసక్తి కలిగేలా విద్యా బోధన చేయాలని డీఐఈఓ వెంకటేశ్వర్లు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం ఆయన సందర్శించారు. కళాశాల అధ్యాపకులతో సమీక్ష నిర్వహించి ఇంటర్ ప్రవేశాల గురించి చర్చించారు. విద్యార్థుల ప్రవేశాల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కళాశాలలో చేరిన విద్యార్థులు తప్పకుండా నిత్యం హాజరయ్యేలా చొరవ తీసుకోవాలని అధ్యాపకులను ఆదేశించారు. కళాశాల ఉత్తీర్ణత శాతం పెంచేలా పని చేయాలని చెప్పారు. అధ్యాపకుల టీచింగ్ డైరీలు, కళాశాల రికార్డులను పరిశీలించారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి దాన్ని దత్తత తీసుకుని సంరక్షించే విధంగా చూడాలని అధ్యాపకులను సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అంజన్‌కుమార్, అధ్యాపకులు ఉన్నారు.

'చలో హైదరాబాద్' జయప్రదం చేద్దాం



వినతిపత్రం సమర్పిస్తున్న కార్మికులు

జడ్చర్ల టౌన్: సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో తలపెట్టిన చలో హైదరాబాద్ జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ కోరారు. మంగళవారం కార్యక్రమానికి సంబంధించి అనుమతి కోరుతూ మున్సిపల్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ రాంమూర్తికి వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులందరిని వెంటనే పర్మినెంట్ చేయాలని, పీఆర్‌సీ చైర్మన్ సిఫారసు మేరకు కార్మికులకు వేతనాలు అమలు చేయాలని, కార్మికుడు డ్యూటీ మృతిచెందితే రూ.25లక్షల ఇన్సూరెన్స్ పథకం వర్తింపజేయాలనే సమస్యలను వినతిపత్రంలో పొందుపర్చారు. హైదరాబాద్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం వద్దకు కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కృష్ణ, నర్సమ్మ, దేవమ్మ, శివ, విద్యాసాగర్ పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ పరిశీలన షురూ



ఏనుగొండ శివారులో విచారణ చేస్తున్న తహసీల్దార్ పార్థసారథి

మహబూబ్‌నగర్ రూరల్: ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న వారి స్థలాలను 58, 59 జీఓల ప్రకారం క్రమబద్ధీకరించేందుకు రెవెన్యూ అధికారులు సమాయత్తమయ్యారు. ఇందులో భాగంగా అర్బన్ మండలంలోని ఏనుగొండ రెవెన్యూ శివారులో గల సర్వేనంబర్ 25లో దరఖాస్తు చేసుకున్న వారి జాబితా ఆధారంగా మంగళవారం పరిశీలించారు. మండలంలో జీఓ 58 కింద 1,206, జీఓ 59 కింద 298 దరఖాస్తులు వచ్చాయి. వీటి పరిశీలనకు నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందానికి తహసీల్దార్ నేతృత్వం వహించనుండగా ఇతర సిబ్బంది సహాయకులుగా ఉండనున్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా స్థలాలు ఉన్నాయా అంటూ విచారించారు. తహసీల్దార్ పార్థసారథి ఆధ్వర్యంలో సిబ్బంది ప్రత్యేక బృందాలుగా దరఖాస్తుల పరిశీలనకు శ్రీకారం చుట్టారు.

నాణ్యమైన ఎరువులను విక్రయించాలి



మూసాపేటలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ యశ్వంత్‌రావు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను మంగళవారం ఏడీఏ యశ్వంత్‌రావు తనిఖీ చేశారు. దుకాణాల్లో ఉన్న ఎరువులు, పురుగుల మందుల వివరాలను పరిశీలించి వాటి నాణ్యతపై ఆరా తీశారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులను అందుబాటులో ఉంచాలని డీలర్లను ఆదేశించారు. స్టాకుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఎరువులు, పురుగుల మందులను కొనుగోలు చేసిన రైతులకు తప్పకుండా రశీదులు అందించాలని సూచించారు. అదే విధంగా మూసాపేటలో జీలుగ సాగును పరిశీలించారు. తుంకినీపూర్‌లో మొలక శాతం తక్కువ ఉన్న పత్తి పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాజేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య రావొద్దు



సమీక్ష నిర్వహిస్తున్న డీఆర్‌డీఓ, డీపీఓ

అడ్డాకుల: గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఓ యాదయ్య, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో స్వచ్ఛ సర్వేక్షన్, హరితహారం, క్రీడా ప్రాంగణాలు, వైకుంఠధామాల నిర్వాహణపై ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, ఎంపీఓ శ్రీదేవితో కలిసి సమీక్ష చేశారు. గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని డీఆర్‌డీఓ కార్యదర్శులకు సూచించారు. పంచాయతీ భవన నిర్మాణాల కోసం నిధులు మంజూరైన గ్రామాల్లో నిర్మాణాలు పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హరితహారం విజయవంతం చేసేందుకు అందరూ కలిసి సమష్టిగా కృషి చేయాలని కోరారు.

చక్రాపూర్‌లో డీపీఓ పర్యటన

మూసాపేట మండలం చక్రాపూర్‌లో మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు పర్యటించారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా ఎంపీఓ సరోజతో కలిసి గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. డంపింగ్ యార్డును పరిశీలించి తడి, పొడి చెత్త గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో సర్పంచ్ శైలజారెడ్డి, కార్యదర్శి కార్తిక్ ఉన్నారు.

జనాభా నియంత్రణపై అవగాహన తప్పనిసరి



నవాబుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నవాబుపేట: జనాభాను నియంత్రిస్తేనే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని మండల వైద్యాధికారి విజయలక్ష్మి, డాక్టర్ నవీన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వైద్య సిబ్బందితో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేపట్టారు. వారు మాట్లాడుతూ దేశ జనాభాను తగ్గించే దిశగా అందరూ కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శకుంతల, శ్రీనివాస్‌రెడ్డి, అవినాష్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఆస్పత్రి నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు, కార్యక్రమంలో వైద్యాధికారి మనుప్రియ, సూపర్‌వైజర్ మరియమ్మ, హెల్త్ అసిస్టెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

భూత్పూర్: గ్రామాల్లో కుటుంబ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి తహసీల్దార్ చెన్నకిష్టన్న సూచించారు. మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి భూత్పూర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలన్నారు. చిన్న కుటుంబం చింతలేని కుటుంబ అనే నినాదంతో ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



దేవరకద్రలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

దేవరకద్ర: ఉచిత విద్యుత్ అవసరం లేదంటూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ శ్రేణులు తీవ్ర స్థాయిలో నిరసన తెలుపుతూ దిష్టిబొమ్మను దహనం చేశారు. నియోజకవర్గ కేంద్రంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో నాయకులు భారీ ఊరేగింపు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ వ్యవసాయ వ్యతిరేక విధానాలకు ఇది నిదర్శమని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అన్నారు. రైతులపై వారి వైఖరి ఎన్నికలకు ముందే వెల్లడైందని, రైతు సంక్షేమం అంటే కాంగ్రెస్‌కు గిట్టదని ఆరోపించారు.

భూత్పూర్: పట్టణంలోని చౌరస్తాలో మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

కోయిల్‌కొండ: రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా మండల కేంద్రంలో స్వామి వివేకానందచౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకులు రోడ్డు నిరసన వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి రైతులకు వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై జెడ్పీటీసీ సభ్యుడు ఇంద్రయ్య సాగర్ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్‌ఎస్ నాయకులు దహనం చేశారు.